మద్రాసులో సినిమా స్టూడియో చూడటానికి అనుమతి అంత కష్టమని నాకు తెలియదు!

ఏదైనా ప్రయత్నం చేశాకేగా అందులో సాధక బాధకాలు తెలిసేదని మరోసారి రుజువయ్యింది!

ఎవరి సిఫారసుతో ఉత్తరం తెస్తే తేలిగ్గా పని అవుతుందో తెలియదు!

తీరా ఉత్తరం కోసం ప్రయత్నించాకే తెలిసింది, అందరూ ఉత్తరాలు ఇవ్వరని... అలా అందరు వ్రాసిన ఉత్తరాలూ పనికి రావనీ!

# అహాక గురుదక్షిణ

## ఎం. డి. సౌజన్య

ఆ విషయం మరోసారి స్టూడియో మేనేజరు నా ఉత్తరం తిరస్కరించాకగానీ తెలియలేదు!

నేను స్టూడియో చూడలేకపోయినందుకు బాధ వేయలేదుగాని, నాతో మద్రాసు చూడటానికి టూరిస్టు స్పెషల్ బస్సులో వచ్చిన నా కాలేజీ స్టూడెంట్స్ నిరాశ చెందటమే నాకు బాధగా అనిపించింది.

స్టూడియో బయట బస్సు తెరచాప విరిగిన బోటులా వుంది.

నేను ఆరోజు ఉదయం నుంచి ప్రయత్నిస్తూనే వున్నాను!

కాని...తెలిసినవాళ్ళు ఊళ్ళోలేరు!

తెలిసిన వారిచ్చిన రికమండేషను లెటర్లు స్టూడియో మేనేజర్...లెక్కచేయటం లేదు!

జీవితంలో చాలా ఓటములు-ఎదురు చూసినవి, చూడనివి... ఎరుగుదును!

కాని...ఈ ఓటమి ముందు అవన్నీ... ఒక్క లెక్క కాదనిపించింది!

చివరికి డైరెక్టుగా...ఏ తెలుగు హీరోలనైనా కలసి పరిస్థితి వివరించి సాయం అర్థించాలనుకున్నాను!

కాని...తెలుగు హీరోలంతా ...ఎక్కువ మంది హైద్రాబాద్‌లో కొందరు, మరికొందరు ఎక్కడో అవుట్‌డోర్‌లో వుండటంతో ఆ పని అయ్యేది కాదని తేలిపోయింది.

ఇక ఓటమి అంగీకరిస్తూ...మద్రాసులో స్టూడియో చూడలేకపోయామనుకుంటూ వెళ్ళబోతున్నాను!

ఇంతలో "మాష్టారూ!" అంటూ గొంతు వినిపిస్తే అటు తిరిగి చూశాను.

అప్పుడే లైట్ ఎల్లోకలర్ అంబాసిడర్ దిగిన నల్ల కళ్ళద్దాల వ్యక్తి "నన్ను గుర్తుపట్టలేదా మాష్టారూ?" అన్నాడు, చేతులు జోడించి నమస్కరిస్తూ.

అతని గొంతు ఎప్పుడో పరిచయమున్నట్టు అతని రూపు రేఖలు నాకు ఒకప్పుడు బాగా తెలిసినవే అయినట్టు అనిపిస్తోంది!

అతని చిన్న గడ్డం గిరజాలు దిగిన జుట్టు, పొడుగాటి పైజామా లాల్చీలో...నా దగ్గర ఇరవై ఏళ్ళుగా చదువుకున్న...వేలమంది విద్యార్థుల్లో ఒకడై వుంటాడా?!?

నా మస్తిష్కంలోని పొరల్లో చిన్న సంచలనం ప్రారంభమైంది!

ఇతనెప్పుడో నాకు బాగా సన్నిహితంగా మెలిగిన శిష్యుల్లో ఒకడై వుంటాడా?

ఆలోచిస్తున్నాను!

"నేనెవరో గుర్తురాలేదా సార్!...!?" అన్నాడు గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తున్న నా ముఖ కవళికలు పరిశీలిస్తూ.

నేను ఓడిపోయానని నా వెర్రి మొహం చూసి పసిగట్టినట్టున్నాడు. "నేను...'సరస్వతి మిత్ర' అనే పేరుతో...ఇంటర్ కాలేజియేట్ కాంపిటీషన్‌కి...'సవాల్ పై సవాల్' నాటిక వ్రాశాను...!" అన్నాడు గతం గుర్తుచేస్తూ.

"ఔను... 'సవాల్ పై సవాల్...' వ్రాసిన విజయ కుమార్...!" అన్నాను ఆశ్చర్యంగా, అతని మాటలు నమ్మలేక.

ఒక్కసారిగా నా ఆలోచనలు పదేళ్ళు వెనక్కు వెళ్ళాయి!

ఆరోజు, ఇంటర్ కాలేజీ కాంపిటీషన్‌లను నాటికను పంపటానికి టీమ్‌ను ఎన్నిక చేయటానికి నేను కల్చరల్ ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జిగా ప్రయత్నిస్తున్నాను!

స్టూడెంట్స్ టీమ్స్‌లో ఏ టీమ్ కూడా నాకు నచ్చలేదు.

కారణం! ఏ టీమ్ కూడా సరిగా పెర్షన్స్ అన్నా అప్పచెప్పే స్థితిలో లేదు!

అదే విషయం వాళ్ళతో చెప్పాను.

అందరూ నిరుత్సాహపడ్డారు.

ఇంకా కాంపిటీషన్ మూడురోజులే వుంది. మూడురోజుల్లో పెర్షన్స్ వచ్చినా, యాక్షన్ రాకపోతే...ఇంటర్ కాలేజీ కాంపిటీషనులో ఘోరంగా అల్లరి పడాల్సి వస్తుంది!

కాని ఎవరూ ఊహించని విధంగా జలజ అనే కాలేజీ అమ్మాయితో 'సవాల్ పై సవాల్' నాటకం వేస్తానని 'సరస్వతీ మిత్ర' ముందుకు వచ్చాడు.

అంతవరకు మగపిల్లలే ఆడ వేషాలు వేస్తూ 'మేల్ ఇన్ ఫిమేల్ రోల్' లో మా మగ విద్యార్థులే ఇంటర్ కాలేజీ కాంపిటీషనులో బహుమతులు పొందారు.

మగపిల్లలు-ఆడపిల్లలు కలసి చదువుకుంటున్న కో ఎడ్యుకేషన్ ఉన్న కాలేజీ మాది! కాబట్టి, ఆడపిల్లలు-మగపిల్లలు కలసి ఒకే నాటికలో నటించటం, మా ప్రిన్సిపాల్‌గారు వొప్పుకోరు.

అలా ఇద్దరు-మగ-ఆడ-... ఒక నాటికలో కలసి నటిస్తే, వచ్చే ఇబ్బందులు ఎలాంటివో అందరికీ తెలిసినవే!

కాని నాకు ఆశ్చర్యం కలిగేట్టు జలజ ప్రిన్సిపాల్ నుంచి అనుమతి పత్రం కూడా తెచ్చుకుంది.

ఇక ఆ టీమ్‌ను అనుమతించక తప్పదని రిహార్సల్స్ ప్రారంభించమన్నాను.


అయితే అక్కడ చూస్తున్నవాళ్ళంతా ఆశ్చర్యపడేట్టు ఆ నాటికలో ఒక రేప్‌సీన్ వుంది.

ఆ సీను రిహార్సల్సులో చూస్తేనే నాకు వళ్ళు గగుర్పొడిచింది!

మన లాక్షణికులు అలాంటి దృశ్యాలు రంగ స్థలం మీద ఎందుకు నిషేధించారో ఆ దృశ్యం చూస్తేనే అర్థమయ్యింది!

అంత ఘోరంగా దాదాపు...ప్రేక్షకులు వూహించని విభ్రాంతిలో ముంచే ఆ దృశ్యం... రంగు రంగుల సెట్టింగుల్లో...రాత్రి పూట ఫోక్‌సింగ్ లైట్ల కాంతిలో...ఒక ప్రక్క భయంకర మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్‌లో వస్తుండగా... ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతి, జడ్జెస్ ఎలాంటి...విభ్రాంతికి లోనవుతారో...వూహకందటం లేదు!

అతను వ్రాసి, కాంపిటీషనుకు తయారైన ఆ నాటికలోని ఆ దృశ్యాన్ని గురించి ఏమడుగుతానో అర్థం



చేసుకున్నట్టున్నాడు, అన్ని రసాల్లోకి శృంగార, భయానక, భీభత్సరసాలు...నాటికలో ప్రదర్శించి నప్పుడు...తప్పక ఆ దృశ్యాలే ప్రేక్షకులకి...వాళ్ళతో పాటు జడ్జెస్‌కి గుర్తుంటాయి సార్! ఈ శృంగార భీభత్స రసాల ముందు... తక్కిన...కామెడీ...ట్రాజెడీలు... దిగదుడుపే! శృంగార భీభత్స, భయానక దృశ్యాల్లో ప్రేక్షకులకు ఒక విధమైన థ్రిల్ కలుగుతుంది సార్! అదే నాటకానికైనా...సినిమాకైనా ప్రాణం! సిని మాల్లో...స్టంట్‌సీనులు, లవ్‌సీనులు, తన్నుకోవటాలు, చంపుకోవటాలు, తగలబెట్టుకోవటాలు · ఎంత సహజమో, ఇవీ అంతే సహజం! ఈ నాటిక... ఈ ఒక్క సీన్ వల్లే బెస్ట్ ప్రొడక్షన్, బెస్ట్ యాక్షన్, బెస్ట్ క్యారెక్టర్ల బహుమతులు వస్తాయ్ చూడండి!' అన్నాడు.

నాటకం...నాటిక లక్షణాలు, నాటిక ప్రయోజనం, నాటకం ద్వారా ఇవ్వాల్సిన సందేశం, ప్రేక్షకులకి ఏ విధంగా, ఏ రసం ద్వారా రసానుభూతి కలిగిం చాలో...ఒక చిన్న లెక్చరిచ్చాను.

నా మాటలు విన్న 'సరస్వతీమిత్ర' అప్పటికి ఏం మాట్లాడలేదు కాని, అతను అన్నట్టే ఆ నాటిక 'సవాల్ పై సవాల్' కే అన్ని ప్రథమ బహుమతులు సంపాదిం చాడు.

అప్పుడు మొదటి సారనిపించింది "ఏదో నాక వైవిధ్యాన్ని క్రొత్తగా ప్రదర్శించి ఇతను నాటకాన్ని రక్తి కట్టించి బహుమతులు సంపాదించాడని.

కాని తరువాత ఏడు కూడా 'సరస్వతీ మిత్ర', 'అన్నా చెల్లెలి మధ్య' ప్రేమ కథాంశాన్ని నాటికగా ప్రదర్శించి, మళ్ళీ బహుమతులు సంపాదించాడు.

తరువాత అతను ఒక అమ్మాయికి ఇద్దరు భర్తలున్న కథను నాటకంగా ప్రదర్శిస్తూ, మద్రాసులో జరిగే నాటిక పోటీల్లో పాల్గొని, అక్కడ పెద్ద సంచలనం సృష్టించాడు.

అక్కడే తరువాత జలజను పెళ్ళాడి ఆమె అంద చందాల సాయంతో సినిమా రంగంలో మొదట రచయితగా చేరి, క్రమేపి ఒక్కో మెట్టూ ఎక్కుతూ, చివరికి డైరెక్టర్ అయ్యాడు.


అక్కడ ఆ రంగంలో అదే వింతధోరణితో వింత వింత కథలల్లి, యాంటీసెంటిమెంట్ పేరుతో ప్రతి సినిమాతో ఒక సంచలనం సృష్టించాడు.


గత అయిదారేళ్ళలో విడుదలైన అతని నలభై చిత్రాలు అన్ని భాషల్లోకి చొచ్చుకుపోయి, అతను సూపర్ డైరెక్టర్ లిస్టులోకి చేరిపోయాడు!

ఇప్పుడు పరిశ్రమ యావత్తూ అతని పాదాక్రాంతమై వుంది. సూపర్ స్టార్స్-ఆడా మగా తేడా లేకుండా అతని కనుసన్నల్లో మెలుగుతున్నారు.

డిస్ట్రిబ్యూటర్లు, ఫైనాన్షియర్లు అతని మాటను వేద వాక్కుగా పాటిస్తారు.

ప్రతి కథలో ఏదో ఒక కొత్తదనం, తాము వూహిం చని విధంగా సృష్టించి ఎప్పటి కప్పుడు సంచలనం






సృష్టించి తన ప్రత్యేకతను నిలుపుకుంటున్నాడు-

-డైరెక్టర్ మిత్ర!

ఇప్పుడతని పేరు! డైరెక్టర్ మిత్ర!

అయితే ఇప్పటివరకు 'ఆ సరస్వతీ మిత్ర' ఈ డైరెక్టర్ మిత్ర ఒకటని నాకు తెలియదు. దీనికి కారణం...నేను ఇప్పుడొస్తున్న తెలుగు సినిమాలు నచ్చక చూడకపోవటమే!

"రండి మాష్టారు! రెండో ఫ్లోర్‌లో...నేను షూట్ చేయబోయేవున్న ఒక క్లాస్‌రూమ్ షాట్ వుంది! అందులో మీలాంటి లెక్చరర్ తెలుగు పాఠంలో 'వరూధినీ-ప్రవరాఖ్యుల' ప్రేమ ఘట్టం చెప్పాలి...! రండి! మీరు మీ విద్యార్థులే ఆ సీనులో సహజత్వం కోసం నటించండి!' అన్నాడు. నిముషాల్లో నేను తెచ్చిన స్పెషల్ టూరిస్టు బస్సులో వచ్చిన నా విద్యార్థులే ముఖాలకు పౌడర్లు అద్దుకొని, అప్పటికే సిద్ధంగా వున్న క్లాస్‌రూమ్ సెట్‌లో హుషారుగా కూర్చున్నారు. ఇక ఆ బంగారు అవకాశం పోగొట్టుకోకూడదని నాకూ అనిపించింది. నాకు ఇష్టం లేకపోయినా, నేనూ నా ముఖానికి కాస్త రంగు పులుముకుని, తెలుగు పాఠం చెప్పటానికి ఉపక్రమించాను.

'వరూధినీ-ప్రవరాఖ్యుల' ప్రేమఘట్టంలో ఏ ఏ డైలాగులు, ఏ పద్యం పాడి, తరువాత వివరణ ఏం చెప్పాలో 'డైరెక్టర్ మిత్ర', నాచేత అయిదారుసార్లు అనిపించాడు.

పది నిమిషాల్లో షాట్ ఓకే అయ్యింది! నాలుగు టేకులు తిన్నా అంతా బాగా చేశాము.

షూటింగ్ ముగిశాక, స్టూడియోలో తిరిగి చూడటంతో పాటుషూటింగ్‌లోపాల్గొన్నందుకు, నాతోపాటు నా విద్యార్థులంతా సంతోషించారు.

మేమంతా సినిమా యాక్టర్లం అయినంత గొప్పగా సంతోషపడ్డాము.

అయితే నేను, నాతోపాటు నా విద్యార్థులు పాల్గొన్న షాట్ ఆ సినిమా విడుదలయ్యాక చూస్తే నా మతి పోయింది.

నా పాత్రధారి అయిన ఆ లెక్చరర్ వరూధినీ ప్రవరాఖ్యుల ప్రేమ ఘట్టం చెబుతూ చెబుతూ, తన ఎదురుగా వున్న ఓ అందమైన స్టూడెంట్‌నే వరూధినిగా వూహించుకొని 'డ్రీమ్ సీక్వెన్స్'లో పడిపోతాడు.

ఆ దృశ్యం చూసిన నాకు చెమటలు పట్టాయి! అయితే అన్ని కేంద్రాల్లో ఆ దృశ్యం వల్లే పిక్చర్ హిట్టయిందని ప్రేక్షకులు-పత్రికలు ఆ చిత్రాన్ని ఎంతో మెచ్చుకోవటం జరిగింది.

*

